
# ఆమె త్యాగం

ఆకునూరి హసన్

యవ్వనంలో ఏ ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదించకుండానే ఉద్యోగమనే చట్రంలో చిక్కుకుపోవడం సతీష్‌కి నచ్చలేదు.

డిగ్రీ పాసయిన రెండేళ్ళకే రైల్వే రిక్రూట్‌మెంట్ పరీక్ష పాసవడం, అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా పోసింగ్ రావడంతో అందరూ అదృష్టవంతుడన్నారు. అతనికి మాత్రం అప్పుడే ఈ బాధ్యతలు ఎందుకు తగులుకున్నాయా అనిపించింది.

స్వేచ్ఛనీ, ఆనందాన్నీ కోరుకునే తను ఎందుకీ పరీక్ష రాశాడా అనే యోచనతోటే ఉద్యోగంలో చేరాడు. ట్రైనింగ్ పూర్తయ్యాక మారుమూల స్టేషన్లో పోస్టింగ్.



మారుమూల రైల్వేస్టేషన్. పొద్దుట రెండు, సాయంత్రం రెండు ప్యాసింజర్ రైళ్ళు మాత్రమే ఆగుతాయి. రోజంతా రాక్షసబొగ్గు, ఐరన్‌ఓర్ మోసుకెళ్ళే గూడ్సు రైళ్ళు మాత్రం విసుగు లేకుండా వెళ్తుంటాయి.

ఊరికి దూరంగా రైల్వేస్టేషన్. పక్కనే నాలుగైదు క్వార్టర్లు. ఆ వెనగ్గా వేప, రావిచెట్లు. చుట్టూ అరుగు. ఎంతసేపు మాట్లాడినా తోటి ఎఎస్సెమ్‌లూ, ఇద్దరు లైన్‌మెన్‌లు, సిగ్నల్‌మెన్. అప్పుడప్పుడు టీ తెచ్చే కుర్రాడు. ఇంతే.

ఎప్పుడూ పదిమంది ఫ్రెండ్స్‌తో సరదాల్తో, సినిమాలతో రోజుల్ని నిమిషాల్లా గడిపేసిన కాలం. ఇప్పుడీ ఉద్యోగంలో, కొత్త మనుషులెవరూ కనిపించని మారుమూల ప్రాంతంలో క్షణమొక యుగంలా మారింది సతీష్‌కి.

జీవితం మరీ విసుగ్గా, రొటీన్‌గా, మోయలేనంత బరువుగా మారబోతుండగా ఒక్కసారిగా మలుపుతిప్పే సంఘటన ఎదురయింది.

***

ఆరోజు పొద్దుట ప్యాసింజర్ వెళ్ళాక ఏమీ తోచక ప్లాట్‌ఫామ్ మీద నడుస్తూ చివరికి వెళ్ళాడు సతీష్.

దురంగా క్యాబిన్, సిగ్నల్ లైట్లు, సిగరెట్‌కోసం జేబులు తడుముకుంటూ యధాలాపంగా పక్కకి చూస్తే – ఈమధ్యనే కట్టిన సిమెంట్

బెంచ్‌మీద వెదురుగంప కనిపించింది. ఆ గంపలో సగం వరకూ రైలుబొగ్గు. ఆ రూట్లో నాలుగైదు గూడ్సు రైళ్ళలో వ్యాగన్లకొద్దీ రాక్షసిబొగ్గు థర్మల్ పవర్‌స్టేషన్‌కి తరలివెళ్తుంటుంది. అక్కడక్కడ కొన్ని స్టేషన్లలో ఆగినప్పుడు కొందరు గార్డుకీ, డ్రైవరుకీ తెలీకుండా వ్యాగన్లు ఎక్కి బొగ్గు దిమ్మల్ని కిందికి పడేయడం, గంపల్లోకి ఎత్తుకుని ఊళ్ళోకి వెళ్ళి అమ్ముకోవడం రివాజు. చూడబోతే ఇది కూడా అలా దొంగతనంగా బొగ్గు దింపుకుని, గంపకెత్తుకున్న బాపతేనని సతీష్‌కి అనిపించింది.

బెంచీ దగ్గరికెళ్ళి పరికించి చూశాడు. గంపలో సగానికి పైగా నల్లగా నిగనిగలాడిపోతూ కనిపించింది రాక్షసిబొగ్గు.

అక్కడే నిలబడి గంప తాలూకు మనిషికోసం అటూ, ఇటూ చూశాడు. చుట్టుపక్కల ఎవరూ కనిపించలేదు. తను డ్యూటీలో వుండగా ఇలా జరగడం, తన కళ్ళల్లో రాక్షస బొగ్గు దొరకడం ఇదే మొదటిసారి. కాబట్టి గట్టిగా ఉండాలి అనిపించింది. కాసేపు ఆగి చూశాడు. ఎవరూ కనిపించలేదు. వెదురు గంపలోని నల్ల బంగారం నవ్వినట్లనిపించింది.

ఇంతలో అవతల స్టేషన్ వదిలిపెట్టిన బ్లాక్ అయిన గూడ్స్‌కి సంబంధించిన డ్రైవర్ గొంతు వాకీటాకీలో వినిపించడంతో సిగ్నల్ సరిచేయడానికి అక్కడనుంచి స్టేషన్‌వైపు వేగంగా నడిచాడు సతీష్.

మరికొన్ని నిమిషాల్లో గూడ్సు బండి వచ్చి, వెళ్ళిపోయింది. జండాలు టేబుల్ మీద పడేసి మళ్ళీ ఇందాకటి బెంచీ దగ్గరికెళ్ళి చూస్తే, ఈసారి అక్కడ వెదురుగంప కనిపించలేదు. బెంచీమీద నల్లగా బొగ్గుతో, వంకర టింకరగా రాసిన 'మొద్దబ్బాయ్.. వ్వెవ్వె' అనే అక్షరాలు వెక్కిరించాయి.

సతీష్ ముఖంలో రక్తమంతా తన్నుకొచ్చి ఉక్రోషంతో ఎరుపెక్కింది.

రైలు కట్టకి దిగువన చింతచెట్ల వెనగ్గా కాలిబాటలో దూరంగా ఇళ్ళు. గబగబా నడిచివెళ్ళి అక్కడ చూద్దామా. రెడ్‌హ్యాండెడ్‌గా బొగ్గు దొంగని పట్టుకుందామా అనే ఆవేశం కలిగింది. అతికష్టంమీద ఆపుకుని స్టేషన్‌లోకి నడిచాడు.

***

మరుసటిరోజు సతీష్ డ్యూటీ మారింది. ఈసారి సాయంత్రానికి స్టేషన్ చేరుకుని మళ్ళీ వెదురుగంప, రాక్షసిబొగ్గు కనిపిస్తాయని ప్లాట్‌ఫామ్ చివరికి వెళ్ళి చూశాడు.

అటూఇటూ చూస్తుంటే ఒకవైపున వున్న మంచినీళ్ళ కుళాయి దగ్గర నీళ్ళబిందెతో ఒక అమ్మాయి కనిపించింది. ఇరవై ఏళ్ళుంటాయేమో. ఎరుపు రంగు జాకెట్, నీలంరంగు ఓణీ. ఛామనఛాయ రంగులో – ఒకరకమైన నిగారింపు ఆమె చర్మంలో, బుగ్గల్లో. పెదవులు మాత్రం ఎర్రగా, తడిగా మెరుస్తూ సన్నని నడుమూ, కొద్దిగా వెడల్పుగా కటిభాగం. జార్జెట్ వోణీ పొరల కిందనుంచి అస్పష్టంగా కనిపిస్తున్న ఎత్తయిన జాకెట్ ముందు భాగం. అయస్కాంతంలా విచిత్రమైన ఉద్వేగాన్ని రేకెత్తించే ఆకర్షణ ఆమెలో.

నీళ్ళతో నిండిన బిందెని నడుం వొంపులో తమాషాగా ఆనించి వయ్యారంగా నడుస్తూ, అతడ్ని దాటుతూ, బిందెలోని నీళ్ళని మునివేళ్ళతో ముఖంమీద చిలకరించిందాకా – మరో ధ్యాస లేకుండా మనసూ, కళ్ళూ ఆమెకే అప్పగించిన అతను మామూలు లోకంలోకి వచ్చాడు.

''ఏయ్. ఎవర్నువ్వు. నిన్న రైలుబొగ్గు పట్టుకెళ్ళింది నువ్వేనా?'' దబాయిస్తున్నట్టుగా అడిగాడు సతీష్.

నడక ఆపి భుజాల మీంచి వెనక్కి తలతిప్పి చూసిందా అమ్మాయి. నొసలు చిట్లించి, ''రైలు బొగ్గా నాకేం పని?'' అంది.

''బుకాయించకు. బొగ్గు గంపని ఈ బెంచీ మీద పెట్టింది నువ్వు కాదూ'' అన్నాడు.

''నన్ను చూశారా? తీసుకెళ్ళడం'' అడిగింది.

''ప్చ్ లేదు. కాదు'' సన్నగా నసిగాడు సతీష్.

''మరేం. మహా చూసినట్లు దబాయిస్తారేం? ఇప్పుడు నేను స్టేషన్‌కి ఎందుకొచ్చాను?'' ఎదురు ప్రశ్నించింది.

''నీళ్ళకి. బిందె కనిపిస్తోందిగా'' అన్నాడు.

''మరి. రైలు బొగ్గు దొంగతనం అంటారేంటి? మాటలు జాగ్రత్తగా రానీయండి'' ఎదురు దబాయించింది.

బదులు చెప్పలేక తెల్లముఖం వేశాడు సతీష్

''వస్తా. మళ్ళీ రేపొస్తా. మంచినీళ్ళకి'' చెప్పి, ముందుకి రెండడుగులు వేసి ''మొద్దబ్బాయ్'' అని పెద్దగా నవ్వి నీళ్ళ బిందెతో అలాగే నడుచుకుంటూ సిమెంట్ జాలీల కంచె దాటుకుని చింతచెట్ల వెనగ్గా వెళ్ళే కాలిబాటలో మాయమయింది.

కదిలే నడుమూ, నాట్యం చేసే జడా, లయబద్ధంగా చరించే పిరుదులూ వెనకనుంచి అలాగే చూస్తూ నిలబడిపోయాడు సతీష్.

ఇంతలో భుజంమీద బుకింగ్ క్లర్క్ రవీంద్ర చేత్తో తట్టాడు.

''ఏంటోయ్ మైమరిచిపోయి చూస్తున్నావ్. పిల్ల నచ్చిందా?'' చిలిపిగా అడిగాడు. వెనక్కి తిరిగిన సతీష్ అర్థం కానట్లుగా చూస్తూ ''ఎవరా అమ్మాయి'' అన్నాడు.

''అదా. ఇంజన్ డ్రైవర్‌గా పనిచేసి రిటైర్ అయిన అబ్రహాం కూతురు – గ్రేసీ. ఏంటి. మనసు పడ్డావా? కావాలా?'' అడిగాడు.

ఆ ప్రశ్నకి అర్థం కానట్లుగా చూశాడు సతీష్.

''అదేనోయ్. గ్రేసీ నచ్చిందా? కావాలా ఏంటి. అబ్రహాంతో మాట్లాడదాం'' అన్నాడు.

''అదేంటి. అబ్రహాం... ఆ అమ్మాయి నాన్న కదా...''

బదులుగా నవ్వాడు రవీంద్ర.

''ఇద్దరు కూతుళ్ళు, కొడుకూ. గ్రేసీ పెద్దది. అబ్రహాం భార్య చనిపోయి అయిదేళ్ళయింది. ఒక కాలూ, చెయ్యీ పడిపోయి రెండేళ్ళు. కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చేయాలి. కొడుకుని చదివించాలి. అన్నిటికన్నా రోజూ తాగడానికి మందు కావాలి. అన్నీ పెన్షన్‌తో ఎలా గడుస్తాయి. పెద్దకూతుర్ని మార్కెట్లో

"అయస్కాంతంలా విచిత్రమైన ఉద్వేగాన్ని రేకెత్తించే ఆకర్షణ ఆమెలో. నీళ్ళతో నిండిన బిందెని నడుం వొంపులో తమాషాగా ఆనించి వయ్యారంగా నడుస్తూ, అతడ్ని దాటుతూ, బిందెలోని నీళ్ళని మునివేళ్ళతో ముఖంమీద చిలకరించిందాకా – మరో ధ్యాస లేకుండా మనసూ, కళ్ళూ ఆమెకే అప్పగించిన అతను మామూలు లోకంలోకి వచ్చాడు."

పెట్టాడు. మధ్యలో బ్రోకర్లు ఎవరూ లేరు. అతడ్ని అడగడమే. కూతుర్ని ఎరేంజ్ చేస్తాడు. గొప్ప తండ్రి కదూ'' చెప్పుకుపోయాడు.

సతీష్‌కి అతడి మాటలు వింటుంటే గుండెలో గునపంతో కెలికినట్లనిపించింది. రెండుసార్లు చూసిన, మాట్లాడిన పరిచయం. ఆ కాసిన్ని క్షణాల సాంగత్యం... చిలిపి పనులూ, వెక్కిరించి మాయమయిన లేడిపిల్లలాంటి గ్రేసీకి.... ప్రతిరోజూ రాత్రి పులిపంజా లాంటి జీవితమూ... తెలీని బాధతో సతీష్‌కి ఒకవిధమైన దిగులు కలిగింది.

***

ఆరోజు రాత్రి ఒక్కడే రైల్వే క్వార్టర్లో ఎంతకీ నిద్రపట్టక సిగరెట్ వెలిగించి బయటికి వచ్చాడు సతీష్. దూరంగా రైల్వేస్టేషన్‌లో లైట్లు వెలుగుతున్నాయి.

ఎటువైపునుంచో వీస్తున్న గాలికి క్వార్టర్ ముందు వరండా పైకి పాకిన మల్లె తీగ కదుల్తోంది. చిన్నగా నడుస్తూ, గులకరాళ్ళపై అడుగులేస్తూ ప్లాట్‌ఫామ్ మీదికి వెళ్ళాడు. నైట్ డ్యూటీ సిగ్నల్‌మెన్ బెంచీమీద మునగదీసుకుని పడుకున్నాడు. లోపల గదిలో డ్యూటీ ఎఎస్సెమ్ టెలిఫోన్లో అవతల వైపున మరో స్టేషన్ మాస్టర్‌తో మాట్లాడుతున్నాడు.

సిమెంట్ బెంచీ మీద కూర్చుని సిగరెట్ తాగుతూ కొన్ని క్షణాలు గడిపాక దూరంగా చింత చెట్లు – వెనగ్గా నాలుగైదు ఇళ్ళూ – వెలిగే దీపాలూ కాసేపు చూశాడు. చప్పున అతనికి గ్రేసీ గుర్తొచ్చింది. మనసంతా అదోమాదిరిగా మారిపోయింది. అబ్రహాం అనబడే తనెన్నడూ చూడని గ్రేసీ తండ్రి మీద విపరీతమైన కసి, కోపం కలిగాయి.

సిగరెట్ పీకని నేలమీద పడేసి కాలితో నలిపి అసహనంగా అక్కడ్నుంచి లేచాడు.

చిన్నగా నడుస్తూ తిరిగి క్వార్టర్ వైపు అడుగులు వేశాడు. ఆ వేసవిలో మొదటిసారి విచ్చుకున్న మల్లె పూలు మత్తైన పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. ఆకాశం నక్షత్రాలతో వొణుకుతోంది.

వరండా మెట్లెక్కి తలుపు నెట్టబోతుంటే లోపలికి తెరుచుకుంది. ఆశ్చర్యంతో లోపలికి అడుగు వేయగానే తలుపు పక్కనే నిలుచుని వున్న ఆకారం చప్పున రెండు చేతుల్ని భుజాల మీదగా గుండెల మీద పెనవేసి వెనకనుంచి వీపుకి హత్తుకుంది.

స్పాంజి బొమ్మ వొంటికి హత్తుకున్నట్టుగా హాయిగా అనిపించింది. చేతులు వెనక్కి చాచి వెతికితే ఎత్తైన పిరుదులూ, సన్నని నడుమూ, చేతికింద జార్జెట్ వోణీ... ఆకారం ఎవరిదో అర్థమయింది. అతడి నరాల్లో రక్తం వేడెక్కి పరవళ్ళు తొక్కడం మొదలెట్టింది.

"గ్రేసీ.. నువ్వేనా?" అన్నాడు. గుండెమీద గట్టిగా పెనవేసుకున్న ఆ లేత చేతుల్ని తప్పించి చప్పున తనవైపుకి తిప్పుకున్నాడు.

వెనుకనుంచి ప్లాట్‌ఫామ్ మీది ట్యూబ్‌లైట్ కాంతి ఆమె ముఖంమీద పడుతోంది. నక్షత్రాల్లా మెరుస్తున్న కళ్ళు. ఎర్రని పెదవులు. నునుపైన బుగ్గలు. మెడకింది నునుపు. వొంపు తిరిగి భుజాలు. ఇక ఆపుకోలేనట్లుగా ఆమె భుజాల మీద చేతులేసి దగ్గరికి లాక్కుని తడితో మెరుస్తున్న పెదవుల్ని గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు సతీష్.

కొన్ని క్షణాలపాటు ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి అయినట్లుగా కదలకుండా ఉండిపోయిన ఆమె ఒక్కసారిగా అతడ్ని విదిలించుకుని దూరంగా జరిగింది. గుండెమీద చెయ్యేసి నెట్టింది.

ఆమె తిరస్కారంతో సతీష్‌కి పట్టరానంత కోపం వచ్చింది.


"ఏం. పెద్ద పతివ్రతలాగా పోజు కొడుతున్నావ్. నీ సంగతి బాగా తెలుసులే.." అన్నాడు.

ఆ మాటల్తో గ్రేసీ కళ్ళు పెద్దవయ్యాయి. "ఏం తెలుసు?" కోపంగా అడిగింది.

"నీ జాతకం... మీ నాన్న నీకు బుకింగ్‌లు.." అండగా ఒక్కపెట్టున ముఖాన్ని రెండు చేతుల్లో దాచుకుని ఏడవడం మొదలుపెట్టింది గ్రేసీ. "అయిపోయింది... నాశనమయింది. ఇక నాకు దారేది" తనలో తాను మాట్లాడుకుంటూ ఒకపెట్టున కుప్పకూలింది.

ఆమె ఉన్నట్టుండి బరస్ట్ అవడంతో సతీష్ కంగారుపడ్డాడు. ఏం చేయాలో తోచలేదు.

కింద కూర్చుని ఆమె భుజం మీద చెయ్యేసి "ఎందుకు ఏడుస్తావ్? ఊరుకో..." అన్నాడు.




చిన్నగా తల పైకెత్తి అతని కళ్ళలోకి చూసింది గ్రేసీ.

చెంపల మీంచి కన్నీటి ప్రవాహపు మెరుపు తళుకుమంది.

"నేనలాటిదాన్ని కాను. మీకు తెలిసిందంతా అబద్ధం. మా నాన్నే పనికట్టుకుని ప్రచారం చేశాడు. నాకంటూ జీవితం, కలలూ, ఆశలూ లేకుండా బ్రతికినంతకాలం తిండికీ, తాగుడుకీ లోటు లేకుండా సంపాదించి పెడతానని కూతుర్ని కులటగా మార్చడానికి రెడీగా కూర్చున్నాడు. ఇలాంటి తండ్రి లోకంలో ఎక్కడైనా వుంటాడా?"

ఆవేశంతో, రోషంతో, దుఃఖంతో ఆమె గొంతు పూడుకుపోయింది.

ఆమె మాటలు గుండెలో గునపాల్లా గుచ్చుకున్నట్లనిపించింది సతీష్‌కి.

"మగాళ్ళందరూ ఇంతే. ఆడది కనిపిస్తే నలిపి నాశనం చేయడానికి సిద్ధంగా ఉంటారు. ఇంతకాలం ఎలాగోఒకలాగా తప్పించుకుంటూ వచ్చాను. విడిపూలలు మాలలుగా కట్టి సామ్ము చేస్తున్నాను. అయినా నా సంపాదన చాలడం లేదు. చెల్లెలు, తమ్ముడుకోసం అన్నిట్నీ భరించి నాకేమీ కాకుండా రోజులు నెట్టుకొస్తున్నాను. కానీ... కానీ, ఎప్పుడో... తప్పించుకోలేని ఏ అవసరం కోసమో ఎవరో ఒకరికి నన్ను నేను అమ్ముకునే పరిస్థితి వస్తుందేమోనని భయం. మొదటి తప్పుకోసం, నేనెప్పుడు దొరుకుతానా అని ఎదురుచూసే మగాళ్ళు. ముఖ్యంగా మా నాన్న! ... ఆ తర్వాత నాకు జీవిత మనేది లేకుండా చేస్తారని తెలుసు. ఎవరికీ దొరక్కుండా ఇన్నాళ్ళూ బతికాను. మొదటిసారిగా చూసినప్పుడే మీరంటే ఇష్టం కలిగింది. ప్రేమించే, ప్రేమని పొందే అర్హత నాకు ఎలాగూ లేదు. కనీసం నా మనసుకి నచ్చిన మనిషికి మనసూ, శరీరమూ ఇచ్చి... ఆ తర్వాత జీవితాంతం శిక్ష విధించుకుందామనిపించి ఈరోజు మీదగ్గరకొచ్చాను. మీ ఇష్టం. మీరూ మగాళ్ళ లోకంలో ఒక మగాడు. కానీ మన సుందని నా నమ్మకం. లేకపోయినా ఫర్వాలేదు. ఈ జీవితానికి ఇంతే అనుకుంటాను" చెప్పడం ఆపింది గ్రేసీ.

జీవితమంటే సరదాలతో ఖుషీగా సాగిపోయేదేనని భావించే సతీష్‌కి లోకంలోని, జీవితాల్లోని చీకటికోణం కళ్ళముందు నిలిచి గుండెని మెలిపెట్టింది.

కల్లాకపటం లేనట్లుగా – కవ్వించి, కలలు రేపడానికే పుట్టినట్లుగా కనిపించే గ్రేసీ గుండెలో బద్దలవడానికి సిద్ధంగా వున్న అగ్నిపర్వతం భయపెట్టింది.

పైకి కనిపించేదంతా నిజం కాదు. నిజం నీడలో ఎన్నో చీకటి గీతలుంటాయి. కన్నీళ్లుంటాయి. ఫలించని కలలుంటాయి. ఇవన్నీ మగాళ్ల ఆధిపత్యంలోని 'మగలోకంలో' నలిపి, నాశనమవడానికే ఉద్దేశించబడ్డాయి.

గ్రేసీలాంటి అమ్మాయికి.. ఇప్పుడే యవ్వనపు వాకిలి ముందు నిలబడి ఆశ నిండిన గుండెతో ఎదురుచూసే యువతికి – ఇంద్రధనుస్సు లాంటి జీవితం ఉండకూడదా?

ఒరేయ్? సతీష్... ఇడియట్!! నువ్వు అందరు మగాళ్ళలాంటివాడివేనా? హృదయం లేదా నీకు?

గ్రేసీ బుగ్గలమీద జారుతున్న కన్నీళ్ళని వేలి కొసల్తో చిదిపి, ఓదార్పుగా దగ్గరికి తీసుకున్నాడు సతీష్.

***

బలమైన నిర్ణయానికి వచ్చాక ఇక వెనక్కి తిరగలేదు సతీష్. గట్టి ప్రయత్నం మీద దూరంగా మారుమూల స్టేషన్‌కి డిప్యుటేషన్ మీద బదిలీ చేయించుకున్నాడు.

ఆర్డర్ కాపీ అందుకున్నాక సామాను సర్దుకుని తనతోపాటు గ్రేసీని తీసుకెళ్ళడం. ఇదొక్కటే ధ్యేయం. మొదట్లో చెల్లెళ్ళనీ, తమ్ముడ్నీ వదిలిపెట్టి రావడానికి ఒప్పుకోలేదు. తనకన్నా నాలుగేళ్ళు చిన్నదైన చెల్లెలి జీవితం కూడా తనలాగా మారుతుందేమోనని ఆలోచించింది. చెల్లెల్ని, తమ్ముడ్ని కూడా అంతా సర్దుకున్నాక, మంచంలోని తండ్రి కన్నుమూశాక తీసుకెళ్దామని సతీష్ చెప్పాక బలవంతంగా ఒప్పుకుంది గ్రేసీ.

***

ఆ ఊరినుంచి వెళ్ళిపోయే రోజు వచ్చింది.

రాత్రి బాగా చీకటిపడింది. ముందే అనుకున్నట్లుగా సామానుతో ప్లాట్‌ఫామ్ చివర నిలబడ్డాడు సతీష్. ఇంకాసే పట్లో ప్యాసింజర్ రైలు వస్తుంది. గ్రేసీతో కలిసి తాను ఇక్కడ్నుంచి వెళ్ళిపోతాడు. ఇన్నేళ్ళ జీవితంలో ఎట్టకేలకు ఒక మంచి పని చేస్తున్నాడనిపించింది.

ప్యాసింజర్ రైలుకి గంట కొట్టారు. ఇంకా చింతచెట్ల వెనక నుంచి గ్రేసీ రాలేదు. సతీష్‌లో కంగారు మొదలయింది. ఏమయింది గ్రేసీ?... తమ ప్లాన్ అబ్రహాంకి తెలిసిపోలేదు కదా? ఇప్పుడెలా? అని ఆలోచించాడు.

దూరంగా ఒంపులో ప్యాసింజర్ రైలు లైటు కనిపించి, మరి కొన్ని క్షణాల్లో ప్లాట్‌ఫామ్ మీదికి వచ్చి ఆగింది. రెండే నిమిషాలు ఆగే రైల్లో ముందువైపున వున్న కంపార్ట్‌మెంట్‌లో సతీష్ సామాన్లు పెట్టాడు గ్యాంగ్‌మెన్.

ప్లాట్‌ఫామ్ మీద నిలబడి చూస్తున్న సతీష్‌కి చింతచెట్ల గుబురుల్లోని చీకట్లలోంచి కాలిబాటలో గ్రేసీ పరుగులాంటి నడకతో రావడం కనిపించింది. సతీష్‌కి రిలీఫ్‌గా అనిపించింది.

రెండు నిమిషాల సమయం పూర్తవడంతో సిగ్నల్ లైటు ఆకుపచ్చ రంగులోకి మారింది. దూరంగా కంట్రోల్ రూమ్ ముందు నిలబడి వున్న ఎఎస్సెమ్ సతీష్ వైపు చెయ్యి ఊపి గ్రీన్‌లైట్‌ని గాలిలోకి ఎత్తి ఇంజన్ డ్రైవర్‌కి సిగ్నల్ ఇచ్చాడు.

గ్రేసీ ప్లాట్‌ఫామ్ మీదికి అడుగుపెట్టడం – హారన్ వేసిన రైలు ముందుకి కదలడం ఒకేసారి జరిగాయి.

కదిలే రైల్లోకి ఫుట్‌బోర్డు మీద కాలుపెట్టి నిలబడిన సతీష్ ''కమాన్... గ్రేసీ... త్వరగా...'' అంటూ పిలిచాడు.

రెండు జర్కులు ఇచ్చిన రైలు క్రమంగా స్పీడ్ అందుకోబోతోంది.

కదిలే రైలుతోపాటూ ప్లాట్‌ఫామ్ మీద పరుగులాంటి నడకతో వడివడిగా నడుస్తున్న గ్రేసీ చేతిని అందుకున్నాడు సతీష్. ''రా... ఎక్కేసెయ్... స్పీడు అందుకుంటోంది క్విక్'' కంగారుగా అన్నాడు.

రైలెక్కడం మానేసిన గ్రేసీ అలాగే పరిగెడుతూ కన్నీళ్ళు నిండిన కళ్ళతో సతీష్ ముఖంలోకి చూసింది.

ఆమె ముఖంలోకి చూసిన సతీష్‌కి గుండె ఆగినంత పనయింది. ''ఏంటి?... ఏమయింది...?'' గొంతు పెగుల్చుకున్నాడు.

''నన్ను క్షమించండి. నిన్నటిదాకా చిన్నపిల్ల – నా చెల్లెలు. ఈరోజు నుంచి నాలాగే పెద్దదయింది. నేను మీతో వచ్చేస్తే... నేను తప్పించుకునే నరకం దాన్ని చుట్టుకుంటుంది. నాకున్న ధైర్యం, తెగింపూ దానికి లేవు. రాక్షసుడిలాంటి మా నాన్న నుంచి నా చెల్లెల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నా మీద పడింది. నన్ను క్షమించండి. నేను మీతో రాలేను. మర్చిపొండి నన్ను..'' చెంపల మీంచి కన్నీళ్ళు జారిపోతుంటే... వేగం పుంజుకున్న రైల్లో, ఫుట్‌బోర్డు మీద నిలబడిన సతీష్ ఆమెనే చూస్తూ తూలిపడబోయి తలుపు పట్టుకున్నాడు.

గ్రేసీ చెయ్యి అతని చేతిలోంచి జారిపోయింది.

ప్లాట్‌ఫామ్ దాటిన రైల్లోంచి కన్నీటి మసకలు చూస్తూ నిలబడిన సతీష్‌కి...

సగం వెలుతుర్లో గ్రేసీ ప్లాట్‌ఫామ్ మీద నిలబడి ఉండడం కనిపించింది. కన్నీళ్ళ మధ్య ఆ దృశ్యం మసకబారి మాయమయింది. జీవితంలో అందరూ అనుకున్నవన్నీ జరగవు... వాళ్ళిద్దరూ ... ఎప్పటికీ కలవని రైలుపట్టాలుగా మిగిలారు. ★

## పిడుగులు - ఉరుములు - మెరుపులు ..... జాగ్రత్తలు



- పొడుగాటి చెట్ల దగ్గర నుంచోకండి
- మీ పరిసరాల్లో మీరే పొడుగ్గా అనేటట్టుగా వుండకండి (ఉదా: పడవలోగాని, విశాలమైన మైదానంలో గాని, ఎత్తయిన కొండమీద గాని నుంచోకండి)
- మీరు నీటిలో వుండకండి. (నదిలోగాని, కాలవలో గాని)
- లోహపు పరికరాల్ని చేతిలో వుంచుకోకండి
- ఎట్టి పరిస్థితిలోను సైకిల్‌పై గాని, స్కూటరుపై గాని ప్రయాణం చేయకండి
- మీ రోమాలు నిక్కబొడుచుకున్నా, ఒళ్ళు జలదరించినా అది పిడుగు పడడానికి ముందు సూచనగా భావించండి. వెంటనే మోకాళ్ళపై తల ఆన్చి నేలమీద కూచోండి. కాని మోకరిల్లడం గాని, నేలమీద పరుండడం గాని చేయకండి.
- వెంటనే ఏదైనా పెద్ద భవనంలోనికి గాని, ఇంటి లోపలికి గాని పరిగెట్టండి. లేకపోతే కారు లోపల కూర్చోండి. (అంటే మీకు రక్షణ కల్పించేది నిజానికి టైర్లు కావు. కారు యొక్క మెటల్ ఫ్రేమ్ మీకు రక్షణ కల్పిస్తుంది.) కాని కారులో కూర్చున్నప్పుడు కారు యొక్క ఏ లోహపు భాగాన్ని తాకకండి. కారులో రేడియో ఆన్ చేయండి.
- భవనంలో మీకు అత్యంత రక్షణ కల్పించే ప్రదేశం కింది అంతస్తులోని ఏదైనా పెద్ద హాలు మధ్యభాగం. కాని పొగ గొట్టం దగ్గరగాని, మండుతున్న పొయ్యి దగ్గర గాని నుంచోకండి.
- టెలిఫోను గాని, విద్యుత్ పరికరాలు గాని (ఇస్త్రీపెట్టె, హీటరు లాంటివి) వాడకండి.
- తలుపులకు, కిటికీలకు, స్టౌలకు దూరంగా వుండండి.
- టి.వి.ని ఆఫ్ చేయండి.

సేకరణ: **పెయ్యేటి రంగారావు**